క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మాచర్ల: ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మాచర్ల మండల విద్యా శాఖ అధికారి–2 అల్లి సురేష్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణం కాలుష్యంతో నిండి పోతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం షేక్ షకీనా అధ్యక్షత వహించారు. విద్యార్థినులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మిషన్ లైఫ్ ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల సైన్స్ కో ఆర్డినేటర్ కొండబాబు, సుల్తానా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని కాలనీలలో ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేయడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పేర్ల చౌడమ్మ అన్నారు. గురువారం గ్రామంలోని ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో కుమ్మరివారి బజారు వద్ద సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో బోరు, మోటార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు మినీ ట్యాంక్‌లను నిర్మించామని, దీంతో కాలనీ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. గ్రామంలోని పలు కాలనీలలో ఏర్పడిన తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ వేసవిలో ఇప్పటి వరకు 4 మోటార్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 4 మోటార్లను నీటి ఎద్దడి ఉన్న కాలనీలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, పేర్ల ముత్తయ్య తదితరులున్నారు.

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం



మాచర్లరూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచారి, గిరిశర్మ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని భక్తులకు వివరించారు. ఆలయ ధర్మకర్త అల్లం కోటిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రావణి దంపతులు స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారిని ప్రత్యేక వాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత, కోటిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో న్యాయవాది రాజగోపాలరెడ్డిపై మర్రిపాడు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి దాడి చేయటాన్ని నిరశిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో గురువారం విధులు బహిష్కరించారు. పట్టణంలోని తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం ముందు న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం పటిష్టమైన చట్టాన్ని రూపొందించాలన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసబాబు, రాజవరపు నరసింహరావు, చవల బాలకోటయ్య తదితరులు ఉన్నారు.

రేపు సరస్వతి శిశుమందిర్‌లో కెరీర్ గైడెన్స్

సత్తెనపల్లి: పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శకత్వం కోసం ఆర్యవైశ్య సేవాదళ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం శనివారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని ఆర్యవైశ్య సేవాదళ్ అధ్యక్షుడు చలువాది హరికుమార్ గురువారం తెలిపారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల మణికుమార్ ఉన్నారు.

పేద కుటుంబాలను ఆదుకున్నది సీఎం జగన్

- పేదల ఉసురు తీస్తున్న ఘనత మాజీ సీఎం చంద్రబాబుది
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ పీఆర్కే
- జే జేలు పలికిన జనం



నెహ్రూనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, దేశంలో పేదల పక్షపాతిగా మొదటి స్థానంలో నిలిచిన వ్యక్తి సీఎం జగన్ అని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ 2వ లైన్‌లో 3, 4 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెహ్రూనగర్ 2వ లైన్‌లో జిల్లా నాయకులు నల్ల వెంకటరెడ్డి, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అదే విధంగా ఆయా వార్డు కౌన్సిలర్లు మహిళలతో కలిసి హారతులిచ్చి ఆహ్వానించారు. అనంతరం ఆయన ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి పేదవానికి సాయం చేయాలని చూస్తుంటే.. ఏదో ఒక రకంగా కుట్రలు చేసి సంక్షేమ పథకాలు ఆపి పేదల ఉసురు తీసుకుంటున్న ఘనత మాజీ సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటిలో మహిళలు ఆనందంగా ఉండాలన్న లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. మీ పిల్లల కోసం అమ్మ ఒడి, వాహన మిత్ర, వైఎస్సార్ చేయూత, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ ఆసరా, నాడు నేడు కింద విద్య, వైద్యం, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేశారనే విషయాన్ని గమనించి జగనన్నకు, నాకు మద్దతు పలకాలని ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రతి ఒక్కరినీ కోరారు. ఇంటింటికీ సమయం కేటాయించి ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరిపారు. ప్రతిపక్షాల కుట్రలు, మాయమాటలు మరచిపోవద్దని, ఎంతో ఔదార్యంతో ప్రతి కుటుంబానికి న్యాయం చేసిన సీఎం జగన్ అవసరం ఈ రాష్ట్రానికి ఎంతో ఉందన్నారు. ఇలాంటి మంచి పథకాలు రావాలంటే మళ్లీ జగన్‌నే సీఎం చేద్దామన్నారు. నెహ్రూనగర్ 2వ లైన్‌లో 350 ఇళ్లకు తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కామనబోయిన కోటయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, ఆయా వార్డు కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, నాగూర్‌వలి, ఎంఆర్ఎఫ్ రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ కరిముల్లా, కో ఆప్షన్ మెంబర్ అల్లి జీవన్, ఎం.శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, నాయకులు హైట్ వీరారెడ్డి, ఆర్ రఘురామిరెడ్డి, చిల్లంచర్ల సత్యనారాయణ, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆదిరాల నాగమణి, ఎస్సీ సంఘ నాయకులు కందుకూరి రత్నరాజు, కంభంపాటి మోషే, పిన్నెల్లి హనిమిరెడ్డి, పార్టీ నాయకులు మంజుల మల్లికార్జునరావు, చిన్నబోయిన శివయ్య, ఆర్ రఘురామిరెడ్డి, బొంగురు, కొండా బ్రహ్మారెడ్డి, రామిరెడ్డి, కొత్తమాసు బ్రహ్మారావు, గడ్డం జయపాల్‌రెడ్డి, వేల్పుల గురవయ్య, మద్దికుంట లక్ష్మయ్య, శ్రీనివాసరావు, లింగారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పెన్షన్‌ల పంపిణీ



శిరిగిరిపాడు సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు



కంటి ఆపరేషన్ చేయించుకున్నా పింఛన్ కోసం వస్తున్న లబ్ధిదారు

వెల్దుర్తి: పెన్షన్‌దారులకు సచివాలయాలలో సిబ్బంది రెండవ రోజు పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మొదటి రోజు రాత్రి వరకు కొంతమందికి పెన్షన్‌లు అందించారు. రెండవ రోజు సచివాలయాలలో పెన్షన్‌దారులకు సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. వృద్ధులు, వికలాంగులు సచివాలయాలకు రాలేని వారికి సచివాలయ పరిధిలోని తండాలు, గూడేలకు, గ్రామాలకు సచివాలయ సిబ్బంది చేరుకొని ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం 3వ తేదీ నుంచి 6వ తేదీలోపు పెన్షన్‌లు పంపిణీ చేయాలని ఆదేశించటంతో సచివాలయాల సిబ్బంది పింఛన్‌దారులకు ప్రభుత్వం ఆదేశించిన టైంలోపు పెన్షన్‌లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వం పెన్షన్‌లు అందించటంతో పింఛన్‌దారులు ఆనందపడుతున్నారు.

రాత్రిపూట సచివాలయ సిబ్బంది పింఛన్‌ల పంపిణీ..

మండలంలోని పలు సచివాలయాలలో బుధవారం రాత్రి 9 గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛన్‌లు పంపిణీ చేశారు. 3వ తేదీ సాయంత్రం సచివాలయాలకు నగదు రావటంతో అప్పటికప్పుడే సచివాలయ సిబ్బంది పింఛన్‌దారులను పిలిపించి పింఛన్ అందించారు. మైకుల ద్వారా, దండోరా ద్వారా పింఛన్‌దారులకు సమాచారం ఇవ్వటంతో వారు సచివాలయాలకు చేరుకొని పింఛన్ అందుకున్నారు. సచివాలయ సిబ్బంది రాత్రి వరకు ఓపికతో పెన్షన్‌లు పంపిణీ చేశారు. నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని సచివాలయాలలో సైతం సిబ్బంది రాత్రి వరకు పింఛన్‌లు అందించటం అభినందనీయమని పెన్షన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ వలంటీర్లను పెన్షన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్‌దారులకు రావాల్సిన నగదును అందించటంతో సచివాలయ సిబ్బంది పెన్షన్‌దారులు ఇబ్బంది పడకుండా పెన్షన్ అందించారు.

5,734 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 5,734 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని గ్రామ సచివాలయాలను సందర్శించి పింఛన్ల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. 11 గ్రామాలలో మొత్తం 7,104 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 5,734 మందికి పింఛన్లు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందజేశామన్నారు. రెంటచింతల గ్రామంలోని మూడు సచివాలయాల వద్ద పింఛన్లు తీసుకోవడానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు వడదెబ్బకు గురికాకుండా టెంట్‌లు, చల్లని తాగునీటిని ఏర్పాటు చేశామని రెంటచింతల సర్పంచ్ పేర్ల చౌడమ్మ తెలిపారు. శుక్రవారం ఆయా సచివాలయాల పరిధిలోని నడవలేని వృద్ధులకు, దివ్యాంగులకు ఆటోలను ఏర్పాటు చేస్తున్నట్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆయన వెంట పేర్ల ముత్తయ్య, కార్యదర్శులు జి.అనంత కోటేశ్వరరావు, వెంకయ్య న్నారు.

రెండవ రోజూ తప్పని కష్టాలు


మాచర్లరూరల్: పింఛన్‌దారులకు గత టీడీపీ ప్రభుత్వంలో ఎదురైన కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రతినెలా 1వ తేదీనే తెల్లవారక ముందే ఇంటికొచ్చి పింఛన్ అందించే వలంటీర్ల సేవలు విపక్షాల క్షుద్ర రాజకీయం కారణంగా దూరమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా పింఛన్‌ల కోసం మండుటెండల్లో వ్యయప్రయాసలకోర్చి గ్రామ సచివాలయాలకు వెళ్లి పడిగాపులు కాస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం మొదలవటంతో పింఛన్‌దారులు సచివాలయాలకు చేరుకున్నారు. వృద్ధాప్యం ఇబ్బందిపెడుతున్నా, అంగవైకల్యం బాధిస్తున్నా, మంచం మీద నుంచి లేవలేకున్నా, ఒంట్లో ఓపిక లేకున్నా, అనారోగ్యం పీడిస్తున్నా టీడీపీ హయాంలో ఇచ్చే రూ.1000 పింఛన్ కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. అంతేకాక మరొకరిని వెంటపెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. అలా పలుమార్లు తిరిగితే కానీ లభించని పింఛన్ తీరు, మళ్లీ టీడీపీ ప్రభుత్వ రోజులు గుర్తుకొస్తున్నాయంటూ పింఛన్‌దారులు అంటున్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ పరిస్థితిని సమూలంగా మార్చి 1వ తేదీనే తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ సొమ్మును చేతిలో పెట్టే వ్యవస్థ వచ్చింది. ప్రతినెలా వలంటీర్ ఇంటి కొచ్చాడంటే 1వ తేదీ వచ్చిందని, హాయిగా ఆనందంగా గడుపుతున్న పింఛన్‌దారులను చంద్రబాబు కూటమి వారి సంతోషాన్ని తుంచేయాలనే కోరికతో వాలంటీర్ వ్యవస్థను అడ్డు తప్పించాలని ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేయించింది. చంద్రబాబు వలనే తమకు ఈ కష్టాలని శాపనార్థాలు పెడుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే తమకు కష్టాలు తప్పి ఆనందకరమైన రోజులు వస్తాయని పేర్కొంటున్నారు.

పింఛన్‌దారులు అవస్థలు

మాచర్ల: రాష్ట్రవ్యాప్తంగా పింఛను పంపిణీలో జరిగిన అన్యాయంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలో 6,100 పలు రకాల సామాజిక పింఛన్లు ఉన్నాయి. వాటిని పంపిణీ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 320 మంది వలంటీర్ల ద్వారా పంపిణీ చేసిన పింఛన్ సచివాలయాలకు పరిమితం చేయడంతో, ప్రతి సచివాలయంలో నలుగురు ఉద్యోగులు పంపిణీ కొనసాగిస్తుండటంతో పింఛన్‌దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలో సైతం సచివాలయాలకు వెళ్లి పింఛన్ తెచ్చుకున్నారు.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తూ పార్టీని నమ్ముకుని సేవలు అందిస్తున్న కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటానని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలో అంబేడ్కర్ కాలనీకి చెందిన 8 కుటుంబాలు బుధవారం రాత్రి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌కు రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ప్రతి ఒక్కరు చల్లని ఆశీస్సులు అందజేసి అండగా ఉండాలన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలలోని పేదలకు జరుగుతున్న మేలును చూసి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కలిస్తానని వారికి అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంగావరపు విజయ్, పరిమళ మరియబాబు, ప్రసాద్, గంగావరపు రాజేష్, సూర్యదేవర సురేష్, డేగల చిన పోలు, గనేపల్లి మరియా, కోటేశ్వరరావు కుటుంబాలు సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కొనసాగాలని కోరుతూ టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమామహేశ్వరరెడ్డి తదితరులున్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

మాచర్ల: శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వెంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారి కల్యాణం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, హోమం నిర్వహించారు. కల్యాణ కమిటీ సభ్యులు పోలిశెట్టి పిచ్చయ్య, గురవయ్య, భాస్కరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వీరాంజనేయరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కాసు

మాచవరం: మండల కేంద్రం మాచవరంలో ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన పలువురు మహిళలను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తూ ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన చికిత్స అందేలా చూస్తానని చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయాలపాలైన వారికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం గ్రామంలో పలువురిని పరామర్శించారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

గురజాల : బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా బండి వీరభద్రుడు, జనరల్ సెక్రటరీగా కావూరి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా డి.లింగరాజు, ట్రెజరర్‌గా చాగంటి సురేష్, మహిళా రిప్రెజెంటేటివ్‌గా బి.సుందర జ్ఞానమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా వి.గురుప్రసాద్, కె.సువర్ణకుమార్‌లు ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారిగా బి.హనుమంతరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి న్యాయవాదులు రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రభుదాసు, చెన్నకేశవరావు, చిన కోటేశ్వరరావు, చలమరాజు, కాశీ విశ్వనాథం అభినందనలు తెలియజేశారు.

రేషన్ పంపిణీ

మాచర్ల: పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలోని 11 ఎంఎం రేషన్ బండ్లు డీలర్ల ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు రేషన్ బియ్యం ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ప్రతి వార్డులో రేషన్ బండి ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తున్నారు. తహసీల్దారు మంజునాథ్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు మురళి పర్యవేక్షించారు. ప్రతి ఇంటికి రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

ప్రభుత్వ విప్ పీఆర్కే



చలంచర్ల సురేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న పల్నాడు జిల్లా అధ్యక్షులు పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గోలి గ్రామానికి చెందిన పార్టీ యువ నాయకులు చలంచర్ల సురేష్‌ను జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శిగా, రెంటచింతల గ్రామానికి చెందిన తోడిచర్ల బాబును మండల ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఎంపిక చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియామక పత్రాలను సురేష్‌కు, బాబుకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోలి సర్పంచ్ మున్నా చంద్రం, పార్టీ నాయకులు పురంశెట్టి నాగేశ్వరరావు, గురవయ్య, మల్లికార్జునరావు తదితరులున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీడీవో సురేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మాచవరం: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బి.సురేష్ బాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు అమలు చేసేందుకు అందరు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రత్యేక అధికారుల అనుమతులతో కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు పాలనా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాన్నారు. ముఖ్యంగా వేసవిలో నీటి సమస్య, పారిశుధ్యం, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, అత్యవసర సేవలు అందించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే చెన్నాయపాలెం, వేమవరం, పిన్నెల్లి గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ శివాయాదవ్, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నే, ఈవోపీఆర్‌డీ వెంగళరావు, సూపరింటెండెంట్ ప్రసాద్, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



నడికుడి మసీద్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 14వ వార్డు, నడికుడి మసీద్‌లో గురువారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులలో ఆయన పాల్గొన్నారు. ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే కాసు దువా చదివారు. పలు సమస్యలను ఎమ్మెల్యే కాసు దృష్టికి ముస్లిం మతపెద్దలు తీసుకువచ్చారు. నారాయణపురం, నడికుడిలలో ఈద్గాలతో పాటు షాదీఖానాలు నిర్మించాలని, మసీద్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ముస్లింలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత వైఎస్సార్ కుటుంబానికి మాత్రమే దక్కుతుందన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించటంలో విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉందని చెప్పారు. మంచి చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని, మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుంచుతానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, పట్టణ శాఖ కన్వీనర్ షేక్ సైదా, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, నాయకులు సయ్యద్‌జాను, తండా హస్సన్‌మీరా, అబ్దుల్లా, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి రాజీనామా లేఖలు అందించిన వలంటీర్లు

కారెంపూడి: మండల కేంద్రమైన కారెంపూడి గ్రామ వలంటీర్లు 50 మంది గురువారం రాజీనామాలు చేశారు. తమ వలంటీర్ విధులు, బాధ్యతల నుంచి తప్పుకుంటున్నామని పేర్కొంటూ ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డికి మూకుమ్మడిగా రాజీనామా లేఖలు అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నడిచేందుకు వీలుగా తమ వలంటీర్ విధుల నుంచి తప్పుకుంటున్నామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన వలంటీర్ అవకాశం వల్ల పేదలకు ప్రభుత్వ పథకాలను అందించామని, కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, దివ్యాంగులకు సేవలందించి వారి సంతోషాన్ని కళ్లారా చూశామని, అలాంటి అరుదైన అవకాశం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. తమ సేవలను గుర్తించకుండా రాజకీయ కోణంలో ప్రతిపక్షాలు తమను తక్కువ చేసి మాట్లాడడం, ఎలక్షన్ కమిషన్ కూడా పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి తప్పించడంతో స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామన్నారు. ఇప్పుడు అందరిలా స్వేచ్ఛగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నడిచే అవకాశం ఉందని, అలాగే ప్రభుత్వ విప్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఐదవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడానికి కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉంటే నరమాలపాడు గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన మరొకరు ఎంపీడీవోకు రాజీనామా లేఖ సమర్పించారు.

ప్రారంభమైన ఉచిత కుట్టు శిక్షణ తరగతులు

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెంలోని శ్రీవేంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో పరి ఫౌండేషన్, అమెరికా వారి సౌజన్యంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ నిర్వహణలో గురువారం ఉచిత కుట్టు శిక్షణా తరగతులను నోబుల్ వరల్డ్ రికార్డు గ్రహీత మామిళ్లపల్లి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు ఉపాధి పొందేందుకు ఇదే చక్కటి అవకాశమని, ఇలాంటి అవకాశాలను మహిళలు జారవిడుచుకోవద్దని సూచించారు. చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు తుమ్మా శౌరెడ్డి మాట్లాడుతూ చెరుకుంపాలెం, చింతపల్లి, కొత్తపల్లి, పుట్లగూడెం, తాడువాయి గ్రామాలకు చెందిన నిరుపేద మహిళలకు ఈ శిబిరం ద్వారా 50 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 50 రోజుల తరువాత శిక్షణ పొందిన వారందరికీ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు 150మంది మహిళలు శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. స్నేహహస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, మన్నెం భద్రయ్య, రామోజీ సాంబశివరావు, గొటిక సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.